తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఏనుగు దాడిలో రైతుకు గాయాలు

పలమనేరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:



ఓ ఏనుగు దాడిలో రైతుకు గాయాలైన సంఘటన పలమనేరు పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని టిఎస్ అగ్రహారంకు చెందిన రైతు రత్నంరెడ్డి మంగళవారం వారి పొలం వద్ద వెళుతుండగా ఓ ఏనుగు ఆయనపై దాడి చేసింది. ఈ ప్రమాదంలో రత్నంరెడ్డి గాయపడగా ఆయనను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే డా. వెంకటే గౌడ, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డ ఆయనను పరామర్శించారు.

## కల్వర్టును ఢీకొన్న టాటాఏస్

### ఒకరు మృతి .. ముగ్గురికి తీవ్రగాయాలు

చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ స్వర్ణముఖీ వంతెన వద్ద మంగళవారం బెంగుళూరు నుండి ఒంగోలు గ్లాస్ (అద్దాలు) లోడ్‌తో వెళుతున్న టాటీ ఏస్ కల్వర్టును ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మణి అక్కడికక్కడే మృతి చెందగా, పింటు శర్మ, ఓరిలాల్, షేక్ నజరత్ తీవ్రగాయాల పాలయ్యారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, 108 వాహన సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# శ్రీకాళహస్తిలో ముంచెత్తిన వాన

### జలమయమైన శ్రీకాళహస్తి వీధులు

### ఉరుములు మెరుపులతో జనం బెంబేలు



కైకాలవీధిలో రోడ్డు చెరువును తలపిస్తున్న దృశ్యం



జలమయమైన జయరామారావు వీధి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వీధులన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి సుమారు ఒకటిన్నర గంట పాటు ఎడతెరపిలేని వర్షం కురిసింది. పట్టణంలోనే కాకుండా చుట్టుపక్కల పల్లెల్లో కూడా వర్షం కురవటంతో ఒబ్బిడి అయి కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి పోయింది. ఊహించని విధంగా వర్షం కురవటంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఓవైపు జోరున కురిసే వాన గుండెలవిసేలా ఉరుములు, మెరుపులు చోటు చేసుకొని భయానక వాతావరణం చోటు చేసుకుంది. ఒకటిన్నర గంటలో పుణ్యక్షేత్రం జలమయమైంది. గతానుభవాలున్నా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవటంలో విఫలమౌతున్నారు. దాంతో వీధులు తటాకాలుగా మారాయి. ముఖ్యంగా జయరామారావు వీధి, ఓటేరు కాలువ, చిన్న మసీదు వీధుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. చిన్న మసీదు వద్ద ఓటేరు కాలువ సామర్థ్యం చాలక నీరు ఉప్పొంగి పోవటంతో మురికి నీరు మసీదులోకి వెళుతుంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. నడుం లోతు నీళ్ళు రోడ్ల మీద నిలబడింది. నగరి వీధి, పెళ్ళి మండపం సర్కిల్, ముత్యాలమ్మగుడివీధి, చేపల మార్కెట్ పరిసరాల్లో, ముఖ్యంగా జయరామారావువీధిలోని సర్కిల్‌లోనూ, అలాగే శ్రీరామనగర్‌కాలనీ పరిసరాల్లో, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కూడలిలో వర్షం నీరు నిలిచి గందరగోళంగా మారింది.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం:**

మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది. సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను ఆపివేసారు. అయితే నాలుగుమాడావీధులు, శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాల్లో ఒక గంటలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే ఎక్కడ ఏ అవాంతరం కల్గిందో అధికారులు పరిశీలిస్తున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరింపబడలేదు. లోతట్టు ప్రాంతాలైన ప్రాంతాలకు సంబంధించి మున్సిపాలిటి ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. జయరామారావువీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇక్కడ ఉన్న పాత మున్సిపల ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన కల్వర్టు వద్ద పారిశుద్య కార్మికులు శ్రమించి నీటినిల్వలు లేకుండా చేశారు.

### తడ పారిశ్రామికవాడపై

# కత్తుల పడగ

### జంట హత్యలతో మరోసారి భయం భయం



తడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న తడ, వరదయ్యపాలెం మండలాల్లో కత్తుల పడగ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ రెండు మండలాల్లో గతంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉండేవి. ప్రస్తుతం ఈ రెండింటినీ తిరుపతి జిల్లాలో కలిపారు. ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు పారిశ్రామిక ప్రగతి పరవళ్ల తొక్కుతున్న తిరుపతి జిల్లాలో సరిహద్దు అల్లరిమూకలు చెలరేగడం పట్ల పలువురు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ఒకవైపు శ్రీసిటీ, మరో వైపు అపాచీ వంటి అతిపెద్ద పరిశ్రమలు ఏర్పాటైన నేపథ్యంలో కనీసం లక్షమంది ఇతర ప్రాంతాల వారు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. వారి అవసరాల కోసం వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. పరిశ్రమలతో పాటు స్థిరాస్తి వ్యాపారాలు, బహుళ అంతస్తుల భవనాలు, హోటల్ బిజినెస్ వంటివి పెరిగాయి. చిరు వ్యాపారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తడ, తడకండ్రిగ జంట గ్రామాలతో పాటు సమీపంలోని పూడి, బత్తులవల్లం, మత్తేరిమిట్ట వంటి పంచాయతీలన్నీ ఏకమైపోయి, అతిత్వరలోనే తిరుపతి జిల్లాకు కొత్త మున్సిపాలిటీ వస్తుందన్న నమ్మకం స్థానికుల్లో పెరిగింది. అయితే ఇటీవల సరిహద్దు తగాదాలు, ఇబ్బందులు, స్మగ్లింగ్‌లు పెరిగిపోతున్నాయి. రెండు జిల్లాలలోని కొన్ని మండలాల నుంచి చౌక బియ్యం వ్యాపారంతో పాటు మట్టి, ఇసుక కూడా పక్క రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. దీనికితోడు ఎర్రచందనం, గంజాయి వంటి అక్రమ రవాణాకు అంతేలేదు. జిల్లాల విభజనకు ముందు ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని భీములవారిపాలెం తనిఖీ కేంద్రం వద్ద కనీసం వారంలో రెండురోజులు తనిఖీలు జరిపి అక్రమంగా తరలిపోతున్న గంజాయిని, దానితో పాటు యువకులను పట్టుకునే వారు. అయితే ఏమైందో ఏమో గాని జిల్లాల విభజన తర్వాత సరిహద్దుల్లో గంజాయి అక్రమ రవాణాపై దాడులు నిలిచిపోయాయి. అదేవిధంగా మరికొన్ని కార్యకలాపాలు నిర్విఘ్నంగా జరిగిపోతున్నాయి. తాజా సంఘటనలో తడకు కూతవేటు దూరంలోని వరదయ్యపాలెం మండలం రాచకండ్రిగ వద్ద ఇద్దరు యువకులను అతి దారుణంగా నరికి చంపేశారు. దీనికి గంజాయి రవాణాతో సంబంధం ఉందని గుసగుసలు ఎక్కువయ్యాయి. అక్రమ రవాణాతో ఇద్దరికీ సంబంధం ఉందా అన్న కోణం, ఇతర కోణం ఏమైనా ఉందా అన్నది స్పష్టం కాలేదు. పైగా ఈ సంఘటనలో ఒకరు మాత్రమే బాధ్యుడని, మరొకరు అతని వెంట వెళ్లిన కారణంగా హత్యకు గురై ఉండొచ్చని కూడా చెప్పుకుంటున్నారు. మొత్తంమీద ఈ దాడి సంఘటనతో పారిశ్రామికవాడల మధ్య పెరుగుతున్న కార్మికులు, ఉద్యోగులు కూడా భయపడుతున్నారు. సంఘటన జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే కొన్ని పరిశ్రమలు, అందులో పనిచేసే కార్మికుల నివాస గృహాలు ఉండటం విశేషం. ఈ పరిధి శ్రీసిటీ హైటెల్ పోలీస్‌స్టేషన్‌లో ఉంది. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం శ్రీసిటీలో పోలీస్‌స్టేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం, అందులో హైటెక్ పోలీస్‌స్టేషన్‌గా తీర్చిదిద్దడం చేశారు. వరదయ్యపాలెం, సత్యవేడు మండలాలకు చెందిన శ్రీసిటీకి సమీపంలోని కొన్ని గ్రామాలను అందులో చేర్చి శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేకంగా డీఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. అయితే వారికి పారిశ్రామికవాడలోని పరిశ్రమలు, ఇతర కీలక విభాగాలలో మంచి సంబంధాలు ఉంటాయి తప్ప సమీప గ్రామాల్లో పర్యవేక్షణ అంతంతమాత్రమేనని చెప్పక తప్పదు. ఈ నేపథ్యంలో రాచకండ్రిగలో జరిగిన ఈ దారుణ హత్యలకు నిశితంగా దర్యాప్తు చేసి ఖచ్చితమైన కారణాలు తెలుసుకోవాల్సిన అవసరాన్ని తడ ప్రాంత ప్రజలు కూడా కోరుతున్నారు.

## గజవాహనంపై ఊరేగిన గజాననుడు

కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో కలసి గజవాహనంపై కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తమిచ్చారు. బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి గజవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం వన్నియర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకస్వాములు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలతో ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అలాగే సాయంత్రం యాగశాలలో యాగమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. తిరిగి రాత్రి అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చస్వాముల పూజలందుకున్న సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడు రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన గజవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ప్రధాన అర్చకులు ధర్మేశ్వర్ గురుకుల్, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, రమేష్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## వైద్య పోస్టుల భర్తీకి పక్కాగా చర్యలు

### -కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:

ఉమ్మడి జిల్లా పరిధిలో వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలకు సంబంధించి ఖాళీగా ఉన్న 162 పోస్టుల భర్తీని పక్కాగా నిర్వహించటానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి సంబందించి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ రాజశేఖర్, డిఎం.అండ్.హెచ్ఓ డా.హరి, డి.సి.హెచ్.ఎస్ డా.నాయక్, తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చంద్రశేఖర్, తిరుపతి మెటర్నటీ ఆసుపత్రి సూపరిడెంట్ డా.లక్ష్మీ, రూయా ఆసుపత్రి సూపరిడెంట్ నాగమునేంద్రుడు ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన 162 పోస్టులకు సంబందించి రోస్టర్ పాయింట్‌లను క్షుణంగా పరిశీలించాలని తెలిపారు. పోస్టుల భర్తీకి వచ్చిన గ్రీవెన్స్‌ను పరిశీలించాలన్నారు. అలాగే రోస్టర్ పాయింట్ నిర్ధారణ, పోస్టుల భర్తీకి సంబందించి ప్రక్రియను డిఆర్ఓను సమన్వయం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పని చేయాలని సూచించారు. వైద్య ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి పొరపాటులకు తావులేకుండా భర్తీ చేపట్టాన్నారు. ఒక పోస్టుకు సంబంధించి ముగ్గురు అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు.

## ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం

### ఘనంగా వీడ్కోలు








రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొని కోవూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. వీరిని రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, గురుమూర్తి ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా కలెక్టర్ హరి నారాయణన్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డి, ఈఎంసీ క్లస్టర్ సీఈవో గౌతమి, ఎస్పీలు రిషాంత్, పరమేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ తదితరులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు. ఆయనకు ఆహ్వానం పలికిన వారితో పాటు టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్ కుమార్, శ్రీకాళహస్తి ఛైర్మన్ అంజూరి శ్రీనివాసులు, ఏర్పోర్ట్ సీఎస్‌వో రాజశేఖర్, డిప్యూటీ కమాండెంట్ శుక్లా, డీఎంహెచ్‌వో శ్రీహరి, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బాలకృష్ణన్, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఆర్డీవో శ్రీకాళహస్తి రామారావు, డీఎస్పీలు రామచంద్ర, చంద్రశేఖర్ వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

# దడపుట్టిస్తున్న డెంగ్యూ



### -వైద్యం కోసం లక్షలు వెచ్చిస్తున్న జనం
### -డెంగ్యూ బారిన పడి యువతి మృత్యువాత

గూడూరు, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

పల్లె, పట్టణాల్లో డేంజర్ డెంగ్యూ దడపుట్టిస్తోంది. చాలామంది విషజ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలై నానా అగచాట్లు పడుతున్న సంఘటనలు జిల్లాలో ఎక్కడ చూసినా దర్శమిస్తున్నాయి. తిరుపతిజిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తీ, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాలలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసిన విషజ్వరపీడితులు ప్రస్తుతం ఎక్కువగా కనిపిస్తున్నారు. జ్వరంబారిన పడిన బాధితులు రెండు, మూడురోజుల వరకు స్థానికంగా ఉండే ప్రాథమికకేంద్రాల్లో వైద్యం పొందినా జ్వరం అదుపులోకి రాకపోవడంతో పట్టణాలకు వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోగా డెంగ్యూ, ఇతర విషజ్వరాల పరీక్షల కోసం పరుగులు పెడుతున్నారు. చాలా మంది భయంతో చెన్నై, తిరుపతి, నెల్లూరు, విజయవాడ నగరాలలో కార్పొరేట్ ఆసుపత్రులకు వైద్యం కోసం తరలివెళుతున్నారు. జ్వరం ముదరడంతో కోలుకోలేక కొంత మంది బాధితులు ప్రాణాలు విడుస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ పర్యవేక్షణ లోపం, సరైన వైద్యసదుపాయాలు లేక సకాలంలో



డెంగ్యూతో మృతి చెందిన అజిత (ఫైల్‌పోటో)

ప్రజలు వైద్యం పొందలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రయివేటు ల్యాబ్‌లలో డెంగ్యూ, మలేరియా, ఇతర రక్తపరీక్షలు చేయించుకుని వైద్యుల వద్దకు వెళ్లి జ్వరనిర్ధారణ చేసుకోవాల్సి వస్తోంది. మరో పక్క ప్రభుత్వ ఆసుపత్రులలో రక్తపరీక్ష కేంద్రాలు ఉన్నా అక్కడ రక్తనమూనా ఇచ్చిన రెండు రోజులకు గానీ డెంగ్యూ, మలేరియా నిర్ధారణ ఫలితాలు తెలియరాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధరణ, మధ్య తరగతి కుటుంబాలలో ఎవరైన జ్వరం భారిన పడితే వైద్యం చేయించేకోలేని పరిస్థితి నెలకొని ఉంది. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తే కొంత వరకు ప్రజలకు ఉపశమనంగా ఉంటోంది.

**డెంగ్యూ బారిన పడి యువతి మత్యువాత**

గూడూరు రెండో పట్టణంలోని మాళవ్యనగర్‌లో నివాసం ఉంటున్న వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్మికనాయకుడు మండ్ల రాజేష్‌కుమార్ కుమార్తె అజిత(21)జ్వరం బారిన పడి మృత్యువాత పడింది. గత రెండు రోజుల నుంచి అజిత జ్వరంతో బాధపడుతోంది. సోమవారం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యపరీక్షలు చేసి రక్తనమూనాలు సేకరించారు. డెంగ్యూ నిర్ధారణ కావడంతో ఆ దిశగా చికిత్స అందించే ప్రయత్నం చేశారు. అప్పటికే జ్వరం ఎక్కువ కావడం, రక్తకణాలు తగ్గిపోవడంతో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గూడూరు మండలంలోని వెడిచర్ల, కందలి, విందూరు, తిప్పవరప్పాడు, చెన్నూరు, కొండాగుంట, వెందోడు, కాండ్ర ప్రాంత గ్రామాల్లో కూడా ప్రజలు జ్వరాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### కుప్పం ఏరియా ఆస్పత్రిలో

## రోగులకు ఆగిన మధ్యాహ్న భోజనం !

### గత నెలాఖరుకు ముగిసిన గడువు!! కొత్త టెండర్లు ఖరారయ్యే వరకు అవస్థలేనా..


కుప్పం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



ప్రభుత్వ వైద్యం పొందేందుకు కుప్పం ఏరియా ఆస్పత్రికి వస్తున్న పేద రోగులకు ప్రభుత్వం ఉచితంగా అందించే మధ్యాహ్న భోజనం ఆగిపోయింది. భోజనం సరఫరా చేసే కాంట్రాక్టరు గడువు గత ఆగస్టు 31వతేది నాటికి ముగిసింది. ఇటీవలే కొత్తగా టెండర్లను జిల్లా ఉన్నతాధికారులు ఆహ్వానించారు. అయితే ఈ టెండర్లు ఖరారయ్యే దాకా రోగులకు భోజనం అవస్థలు తప్పేలా లేవని తెలుస్తోంది. కుప్పం ఏరియా ఆస్పత్రికి రోజువారీ సుమారు 500 మంది దాకా ఒపి పేషెంట్లు వస్తుంటారు. వీరిలో పలు రకాల జబ్బులతో బాధపడేవారు ఏరియా ఆస్పత్రిలోనే చికిత్స పొందేందుకు జాయిన్ అవుతుంటారు. ఇలా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరిన రోగులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా సరఫరా చేస్తుంది. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఇదివరకు ఓ కాంట్రాక్టరు మధ్యాహ్న భోజనాన్ని ఆస్పత్రి క్యాంటీన్ ద్వారా అందించేవాడు. అయితే టెండరు గడువు ఈ ఏడాది ఆగస్టు నెల 31వతేదికి ముగిసింది. ఇటీవలే జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు మధ్యాహ్న భోజనం సరఫరాకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లను జిల్లా కలెక్టర్ ఖరారు చేయాల్సి ఉందని సమాచారం. అయితే ఇదివరకు వచ్చిన టెండర్లు ఖరారవుతాయా లేదా ఉన్నతాధికారులు మరలా రీటెండర్లు దాఖలుకు అవకాశం కల్పిస్తారా అనే సందేహం నెలకొంది. దీంతో ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఉచిత భోజనం అందే అవకాశాలు లేకుండాపోయాయి. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో 75మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారని తెలిసింది. రోగులకు మధ్యాహ్న భోజనం ఆగిపోయిన విషయంగా 'ప్రభాతవార్త' ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డా॥ ప్రవీణ్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తాము టెండర్ల గడువు ముగియక ముందే జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అయితే ఇటీవలే ఉన్నతాధికారులు టెండర్లు పిలిచారని ప్రస్తుతం ఉన్న క్యాంటీన్‌ను నిలుపుదల చేయాలని తదుపరి ఆదేశాలు ఉన్నతాధికారులు ఇచ్చే దాకా తామేమీ చేయలేమన్నారు. అయితే ఆస్పత్రిలో ఉన్న రోగులకు మధ్యాహ్న భోజనం తెచ్చుకునేలా సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పేద ప్రజల సౌలభ్యం కోసం ఏరియా ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనంను అందేబాటులో తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఉష్ణోగ్రతలు

6/9/2022



- తిరుపతి 32 డిగ్రీలు
- చిత్తూరు 34 డిగ్రీలు
- మదనపల్లి 27 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

### బంగారం ధరలు

6/9/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,750

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,182

### కోడిగ్రుడ్ల ధరలు

6/9/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

# అత్యాచారాలను ప్రభుత్వం అరికట్టాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

రాష్ట్రంలో మైనర్ బాలికలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని వీటిని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులిశ్రీకాంత్ డిమాండ్‌చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మైనర్ బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఎన్నో కొత్త చట్టాలు తెచ్చినప్పటికీ మానవ మృగాలలో ఏమాత్రం మార్పురావడం లేదన్నారు. ఇందుకు నిదర్శనమే రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లాలో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై దాడిచేసి గొంతుకోసి యాసిడ్ పోసిన ఘటన రాష్ట్రంలో



ఉన్న మహిళలను దిగ్భ్రాంతికి గురిచేసే విధంగా ఉందని ప్రతి ఒక్కరు మహిళల పట్ల అభివృద్ధికి తోడ్పడకపోయినా పర్యావలేదుకానీ, వాళ్ళ వినాశనానికి కారకులు కాకూడదన్నారు. రాష్ట్రంలో 9నెలల పసిబిడ్డ నుంచి 60ఏళ్ళ ముసలివాళ్ళపై అత్యాచారాలుజరుగుతూనే ఉన్నాయని ఇంకోసారి ఇలాంటి అత్యాచారాలకు పాల్పడిన వారిని నడిరోడ్డుపై శిక్షించాలన్నారు. జనసమూహం తక్కువగా ఉండే బాలికల పాఠశాల, కళాశాల దగ్గర ప్రత్యేకమైన పోలీసు సిబ్బంది ఏర్పాటుచేసి మహిళా విద్యార్థులమనోధైర్యాన్నిపెంచాల్సి ందిగాప్రభుత్వంను డిమాండ్‌చేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర యానాది సంఘ అధ్యక్షులు చందమామలకోటయ్య, రమేష్, భాస్కర్, ఉమతదితరులు పాల్గొన్నారు.

## గురు బ్రహ్మకు గురుతర సత్కారం

రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:



గురు బ్రహ్మగా కొనియాడబడుతున్న రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు నాధమునిరెడ్డికి అత్యంత అరుదైన పురస్కారం ఉత్తమ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ 2022 ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సోమవారం లభించింది. ప్రఖ్యాతిగాంచిన జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ అనంతపురం వైస్ ఛాన్సలర్ రంగా జనార్దన్, రిజిస్ట్రార్ శశిధర్ పలువురు ప్రముఖులు అవార్డును అందజేయడమే కాకుండా ఘనంగా సన్మానించారు. యూనివర్సిటీ పరిధిలోని 139 కళాశాలలు ఉండగా వీటిలో ఆరు కళాశాలల ప్రధాన ఆచార్యులు అవార్డులకు ఎంపికయ్యారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులకు జ్ఞానబోధ చేసే గీతాచార్యుని(శ్రీకృష్ణ భగవానుడు)తో సమానమని నాధమునిరెడ్డి పేర్కొన్నారు. తనకు అవార్డు రావడానికి ప్రేరేపించిన కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, కళాశాల బోధన బోధనేతర సిబ్బందికి, తను అభినందించిన విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.

## వైభవంగా అవనాక్షమ్మ అమ్మవారి జాతర ప్రారంభం

నారాయణవనం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :



మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన అవనాక్షమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందుగా నారాయణవనం గ్రామానికి చెందిన అగుముడిమొదలియార్ కులానికి చెందిన వారు జాతరను జరుపుకోవడం ఆనవాయిగా వస్తున్నది. మంగళవారం మొదటిరోజు నారాయణవనం, కీళగరం, సముదాయం గ్రామానికి చెందిన మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు పొంగళ్లను తీసుకెళ్లి నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవారికి కుంకుమ, పసుపుతో పాటు పుష్పాలను అలంకరించారు. మొకు ్కబడి కలిగిన భక్తులు జంతుబలి ఇచ్చారు. ఆలయం వద్ద ఇసుకేస్తే రాలనంతరం జనంతో భక్తులు నిండిపోయారు.

## అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టులకు ధరఖాస్తు చేసుకోండి

నారాయణవనం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

నగరి ఐసిడిఎస్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలుగా పని చేస్తున్న వారు గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చని ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తు 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు అర్హులన్నారు. ఈనెల 12వతేది లోపు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి ఈనెల 18వ తేది కర్నూల్‌లో వ్రాత పరీక్ష వుంటుందన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంను సంప్రదించాలన్నారు.

## ప్రతి రైతు ఈకెవైసి చేసుకోవాలి - ఎడిఇ

విజయపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :

మండలంలోని ప్రతి రైతు ఈకెవైసి చేసుకోవాలని ఎడిఇ నాగపద్మిని తెలిపారు. మంగళవారం మండలంలోని పన్నూరు ఆర్బికె ఆవరణలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా పథకం కోసం ఈ నెల ఏడో తేదీ లోపు రైతులు ఈకెవైసి చేసుకోవాలని సూచించారు. మేలైన రకాల పంటల సాగు గురించి వివరించారు. రైతులు విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలి, విత్తనం ఎలా ఎంపిక చేసుకోవాలో వివరించారు. వేరుసెనగలో జిప్సం వినియోగం వల్ల ప్రయోజనం వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఓ రజనీకుమారి, ఎఇఓ విజయ్‌కుమార్, సర్పంచ్ సునంద మనోహర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ఆనంద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:



రాచపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ సహోపాధ్యాయుడు హరిబాబుకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్నారు. అనంతరం ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులుఅభినందించారు

## శ్రీ తరుణ గణపతి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంలో భాగంగా మంగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే ఆలయంలో ఉన్న పరివార దేవతలైన సూర్య భగవానుడు సుబ్రహ్మణ్యస్వామి కూడా అభిషేకాలు అలంకరణ చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

**నేడు ఆలయంలో...**

శ్రీ తరుణ గణపతి ఆలయంలో బుధవారం ఉదయం అభిషేకాలు అలంకరణలు, అర్చనలు, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు వివరించారు.

## శివయ్య సేవలో ద్వారకా తిరుమల ఇఓ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంగళవారం ద్వారకా తిరుమల ఇఓ ఆర్‌జెసి కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎసి మల్లికార్జున ప్రసాద్ సారధ్యంలో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆర్‌జెసి త్రినాధ్‌రావు దంపతులకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. మల్లికార్జున్ ప్రసాద్ సారధ్యంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటాలు, తీర్థ ప్రసాదాలను అందించారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులు అవార్డు అందుకున్న బాల సుబ్రహ్మణ్యం

వడమాలపేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులు అవార్డును వడమాలపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం అందుకున్నారు. గురు పూజోత్సవంసందర్భంగావిజయవాడలో సోమవారం ముఖ్యమంత్రి బాలసుబ్రహ్మణ్యంకు బంగారు పతకంతో పాటు 20 వేల రూపాయల చెక్కు, ప్రశంసాపత్రం అందజేశారు. అవార్డు గ్రహీత బాలసుబ్రహ్మణ్యంను కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు.

## సియం జగన్‌ను సత్కరించిన వైకాపా నేత యం.ఆర్.సి. రెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



నెల్లూరు పర్యటనను ముగించుకుని రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత యం.ఆర్.సి.రెడ్డి ఘనంగా సన్మానించారు. యం.ఆర్.సి.రెడ్డిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

## ఆచార్య దేవునికి అపూర్వ పురస్కారం

రేణిగుంట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:



ఆచార్య దేవునిగా అందరి ప్రశంసలు అందుకుంటున్న తిరుపతి కరకంబాడి మార్గంలోని రేణిగుంట మండల శివారు ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డికి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జేఎన్‌టీయూసీ యూనివర్సిటీ అనంతరం ఉత్తమ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ 2022 అవార్డును బహుకరించి ఘనంగా సత్కరించింది. అవార్డును యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రంగా జనార్దన్, రిజిస్టర్ శశిధర్ చేతుల మీదుగా అనంతపూర్‌లోసోమవారం అందుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ పరిధిలోని 139 కాలేజీలు ఉండగా వీటిలో ఆరు కాలేజీల ప్రిన్సిపాల్స్ కు మాత్రమే ఈ అపూర్వ అవార్డులు దక్కాయి. తనకు అవార్డు రావడంలో కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్ అంబరం, తోటి ఉద్యోగుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు.

## వానపాముల ఎరువు తయారీపై శిక్షణ

వడమాలపేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:



రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రం, కరకంబాడి వారు భారత వ్యవసాయ పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి సహకారంతో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వడమాలపేట మండలం పత్తిపుత్తూరు గ్రామంలో మంగళవారం వానపాముల ఎరువు తయారీపై అవగాహన, శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. డా.ఎస్.శ్రీనివాసులు, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ మాట్లాడుతూ రైతులు తమ పొలంలో ఉత్పన్నం అయ్యే వ్యవసాయ వ్యర్థాలు, గృహ వ్యర్థాలు, పశువుల పేడను ఉపయోగించి వానపాముల ఎరువును తయారు చేసుకోవచ్చని, ఈ విధంగా తయారైన ఎరువులు వాడటం ద్వారా పంట సాగులో వారే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు తగ్గటమే కాక నేల సారం, ఆరోగ్యం కాపాడవచ్చన్నారు. మే నెలలో గ్రామ రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాలకు సంబంధించి భూసార పరీక్షా పత్రాలు పంపిణీ చేసి వాటి వినియోగం గురించి వివరించారు. తరువాత స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రైతులకు మొబైల్ వర్మీ కంపోస్టు బెడ్స్ పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు డా. వి.దివ్య, రాముకుమార్‌లు రైతులకు సమీకృత సమాచార వ్యవస్థ కిసాన్ సారథి గురించి వివరించి దాని ఉపయోగాలు, వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ డా. ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు దివ్య, రాముకుమార్, గ్రామ సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## గొల్లపల్లి రోడ్డుకు మరమ్మతులు

విజయపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :

మండలంలోని పాతార్కాడు పంచాయతీలోని గొల్లపల్లిలో మంగళవారం స్థానిక వైసిపి నేత సతీష్ యాదవ్ రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించారు. రోడ్డు గుంతలమయంగా వుందని గ్రామస్తులు మంత్రి రోజాకు తెలపడంతో ఆమె ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతులు చేశారు. దీంతో కొంత ఉపశమనం కలిగిందని గ్రామస్తులు తెలిపారు.

## భక్తులకు దర్శనమిచ్చిన భరద్వాజ మహర్షి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో భరద్వాజ మహర్షి ఉత్సవాన్ని చక్కగా అలంకరించారు. ఆయనతో పాటు శ్రీ-కాళ-హస్తి ఉత్సవ విగ్రహాలను కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకార గురుకుల్ అలంకరించారు. మొదటి పూజలు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చే సంకల్పం చేయించారు. తరువాత బోయిలు మోసుకుంటూ ఉత్సవర్లను పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్యకులైన ఎస్ఎంకె బాబూ గురుకుల్ ఇంటి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. హారతులిచ్చారు. ఊరేగింపు నాలుగు మాడావీధుల్లో సాగింది. పవిత్రోత్సవాల కార్యక్రమాలను ఆలయ అనువంశిక ఆలయ ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామి నాధన్ సారధ్యంలో పౌరోహితులు అర్ధగిరి స్వామి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లోఉపప్రధానార్చకులు కరుణాకర్ గురుకకుల్, శ్రీనివాస గురుకుల్, తేజస్వామి, గోవింద్‌స్వామి, ఆలయ ఎఇఓ వ్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఆలయ సూపరింటెండెంట్ అయ్యనన, ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరాజు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పసల సుమతి, కోండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ, సుబ్బారెడ్డి, సాధన మునస్వామి, జయశ్యాం రాయల్, ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు, ఎంపి శ్రీలక్ష్మీ, నీలా, పార్టీకి చెందిన పాలమంగళం రవి, సెన్నిరు కుప్పం శేఖర్, సుబ్బానాయుడు, బాలగౌడ్, తేజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసంఘం నిధులపై శ్వేతపత్రం విడుదల చేయండి

-రాష్ట్రపంచాయతీరాజ్‌ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

తిరుపతి, సెప్టెంబర్ 6ప్రభాతవార్త :



పంచాయతీల బలోపేతానికి, అవసరమైన అభివృద్ధికి కేంద్రప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులు 7,660కోట్ల రూపాయలు ఏవంయ్యాయ్ునేది రాష్ట్రప్రభుత్వం సమాధానం చెప్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు యలమంచిలి వెంకటబాబురాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు తెలియకుండా వారి ఖాతాలనుంచి భారీ మొత్తంలో నిధులు ఎలా దారిమళ్ళించారని ప్రశ్నించారు. మంగళవారం తిరుపతిలో ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చెందిన సర్పంచ్‌లతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో తెలుగుదేశంపార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్రపంచాయతీరాజ్‌ఛాంబర్ ,రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య, శ్రీధర్‌వర్మ, వట్టికుంటశంకరానారాయణ, లక్ష్మీపతినాయుడు, మనోహరాచారి సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకునేది లేదు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

జగన్‌మెప్పుకోసం స్పృహలో లేకుండా నోటికి వచ్చినటల్లు మ్లాడితే సహించేది లేదని వారికి తగిన బుద్ధిచెప్తామని తిరుపతి తెలుగు దేశం పార్టీ మహిళా పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల.ఉష అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్‌మెప్పుకోసం పోతులసునీత, ఉషశ్రీచరణ్, కళ్యాణి, అమ్మాజీ వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. అనవసంమైన విషయాలమీద పెద్దే శ్రద్ధ రాష్ట్రంలో అమాయక ఆడబిడ్డలు రోజురోజుకు కిరాతకంగా అత్యాచారాలు హత్యలు చేయబడుతుంటే వేడుక చూడడం మాని కాపాడే ప్రయత్నం చేయాలని చూస్తున్నారని ఆగంతుకులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆడబిడ్డలు రాత్రేకాదు పగలు కూడా రక్షణలేకుండా పోతోందని ఆవేదనవ్యక్తంచేశారు. విచ్చలవిడిగాకామాంధులురోజురోజుకు రెచ్చిపోతున్నారని నెల్లూరు జిల్లాలో 9వ తర గతి చదివే ఆడబిడ్డ ఇంట్లో ఉండే కూడా బలవంతం చేసి యాసి డ్‌పో సి గొంతుకోశారంటే జగనన్న పాలన లో చట్టాలు ఎలా ఉన్నాయో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రభు త్వంలో ఉన్నాంకదాఅ నిఇష్టారాజ్యంగా మాట్లాడితే తెలుగు మహిళ లంతా ఏకమై తగిన బుద్ధిచెప్తామన్నారు.



# తిరుపతి డివిజన్

## వైభవంగా తొగట వీర క్షత్రియ సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :



తొగట వీర క్షత్రియ చిత్తూరు, తిరుపతి జిల్లాల సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్, రాష్ట్రకార్యదర్శిబొమ్మలవెంకటరత్నం ఆధ్వర్యంలో యూత్ హాస్టల్‌లో ఘనంగా జరిగింది. వారు మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ కులము బీసీలో ప్రధానమైందన్నారు. గ్రామ స్థాయినుంచి రాష్ట్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రాష్ట్ర తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రామిశెట్టి మమత, రాష్ట్ర కుల పెద్దలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :



నాయి బ్రాహ్మణులను ఎవరైనా కుల పరంగా దూషిస్తే అట్టివారిపై కఠిన చర్యలు ఉండేవిధంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా జీవో నెం.50,1860ను విడుదల చేయడం పట్ల రాష్ట్ర నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మంగళం ప్రజా రవాణా డిపో వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నాయిబ్రాహ్మణులు కుల దూషణలు ఎదుర్కొనే వారని, నేటి ఈ జీవో జారీ వలన నాయి బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయిబ్రాహ్మణుల సంఘం కార్యదర్శి పాకాల సురేంద్ర, తిరుమల నగర్ పంచాయితీ వైసీపీ నాయకులు శివశంకర్ రాజు, శ్రీ కాళహస్తి భాస్కర్, ముని, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :



తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు భీమినేని మునికృష్ణమ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం వెటర్నరీ ఆస్పత్రి ఆవరణంలో లేట్ లయన్ కోటి వీరయ్య రెండవ వర్థంతి సందర్భాన్ని పురస్కరించుకుని దాదాపు 500 మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మునికృష్ణమనాయుడు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదన్న సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం, పేదలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ ఎదుగుదలకు సంస్థ ప్రతినిధులు సైనికుల్లా పనిచేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిత్రమోహన్, ట్రెజరర్ ముబారక్ భాషా, లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినేట్ అడిషనల్ సెక్రటరీ డాక్టర్ కె. రాజేంద్ర ప్రసాద్, లోకేష్‌బాబు, సంపత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## తాగి డ్రైవింగ్ చేస్తే తాటతీస్తా : సిఐ

చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



తాగిన మైకంలో డ్రైవింగ్ చేస్తే తాట తీస్తానంటూ చంద్రగిరి సిఐ ఓబులేష్ ఆటో డ్రైవర్లకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. చంద్రగిరిలోని వివిధ యూనియన్లకు సంబంధించిన ఆటో డ్రైవర్లకు మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఓవర్‌లోడ్, అధిక వేగం, అలసట, మత్తులో, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపటం వలన ప్రమాదాలకు గురయ్యే అవకాశం వుందన్నారు. లైసెన్స్ లేకున్నా, సరైన రికార్డులు లేకున్నా, యూనిఫారం ధరించకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను కొత్తపాటి కోటీశ్వర్ రెడ్డి వివరించగా, పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నూతన ఒరవడిలకు "తోటబడి" తోడ్పాటు

ఉద్యానవన శాఖ మండల అధికారి శైలజ



చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: మామిడి పంటలలో నూతన ఒరవడిలతో అధిగదిగుబడి సాధించడానికి తోటబడి చక్కగా దోహదపడగలదని ఉద్యానవన శాఖ మండల అధికారి ఎస్.శైలజ అన్నారు. మండల పరిధిలోని పనపాకం పంచాయతీలో మంగవారం ఎంపిడిఓ రమేష్‌బాబు, హెచ్ఓ శైలజ తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం లేతచిగుర్లకు తేనె మంచుపురుగు ఉధృతి ఎక్కువగా వుందన్నారు. ఇవి లేత ఆకులలోని రసాన్ని పీల్చడం వలన ఆకులు వంకర్లు పోతాయన్నారు. ఈ క్రమంలో ఆకులపై తేనె వంటి పధార్థాన్ని విసర్జించడం వలన మసి తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు. తేనె మంచు పురుగుల నివారణకు మోనోక్రోట్ ఫాస్ 1.6 మి.లీ, అజాడిరక్టిన్ 1500 పిపియం 3 మి.లీ, సాఫ్ 2.5 గ్రాములు, జిగురు 0.5 మి.లీ, లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకురాలు టి.ప్రియాంక, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మిట్టపాళ్యం రెవెన్యూ సదస్సు

చంద్రగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులు మంగళవారం మిట్టపాళ్యం, తొండవాడ పంచాయతీలలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మావిళిరెడ్డి హేమేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తొండవాడ సర్పంచ్ మల్లం దీపిక చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ రెడ్డి, మిట్టపాళ్యం సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, బుచ్చినాయుడుపల్లి సర్పంచ్ రవి నాయుడు, ఆర్ఐ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాశాలల్లోనే అర్థవంతమైన బోధన

ఏఎంఓ శివశంకర్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో అర్థవంతమైన బోధన జరుగుతుందని తిరుపతి జిల్లా ఏఎంఓ శివశంకర్ అన్నారు. మంగళవాం రామ చంద్రాపురం ఎంఆర్‌సిని ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కిట్లను అందజేతపై విద్యార్థులను అడిగితెలుసు కున్నారు. ప్రతి విద్యార్థి వద్ద తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయించాలన్నారు. పాఠశాలల్లో మిగిలిన షూలను ఎంఆర్‌సికి అందజేయాలన్నారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు లీలా మహేశ్వరీ, రూపావతి, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కాట్‌కు 'భారతీయ సేవా రత్న' అవార్డు!

తిరుపతి ప్రెస్‌క్లబ్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:

తిరుపతికి చెందిన ప్రముఖ సమాజ సేవకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను 'భారతీయ సేవా రత్న' అవార్డుకు ఎంపిక చేశామని 'స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా' వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ ఆకుల రమేష్ తెలిపారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఇండిపెండెన్స్, ఇంటర్నేషనల్ యూత్ డే సంబరాల్లో భాగంగా ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియం నందు ఎంపిక చేసిన వారికి అవార్డులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. కరోనా కాలంలో మొదటి దశ నుండి సుమారు రెండేళ్ల పాటు పేదలు, నిరాశ్రయులకు ఎనలేని సేవలు ఆర్కాట్ చేశారని కొనియాడారు. అనంతరం ఆర్కాట్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డును ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

